నమస్తే తెలంగాణ దినపత్రికకు 14వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
VIJETHA JUNIOR COLLEGE
Saraswathinagar, Shakkarnagar 'X' Road, BODHAN, Dist. Nizamabad
Cell: 9494392080, 9440062701, 8885390048, 8885439543
State 4th Rank B.PAVITRA 994/1000 (BiPC-II)
State 2nd Rank K.PRASHANTH 468/470 (MPC-I)
State 2nd Rank H.LAVANYA 437/440 (BiPC-I)
CH.HARSHITH 991/1000 (MPC-II)
B.AKSHAYA 990/1000 (BiPC-II)
MPC II: M.MITHASRI 989/1000, P.A.LINGURAM 986/1000, G.MAHESH 983/1000, J.MAHESH 979/1000
BiPC II: AKSHAYA 990/1000, K.VINOD 988/1000, P.SATHISH 985/1000, CH.SPOORTHI 981/1000
CEC II: SAI TEJASRI 925/1000, N.ASHRITHA 904/1000
MPC I: K.MAHESH 465/470, CHANDRA KUMAR 465/470
BiPC I: SRAVYA 434/470, G.MAYURI 432/470
Hostel Facility (A/c. & Non A/c)
VIJETHA IIT, JEE MAINS, NEET, EAMCET ACADEMY
SAI VIJETHA JUNIOR COLLEGE (GIRLS)

ఎమ్మెల్యే ప్రకటన తర్వాత జిల్లాలో జరిగిన దాడులు

- సెప్టెంబర్ 23న బైపాస్ రోడ్డులో (ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుడి)కి చెందిన బ్యాచ్ యువకులు, జిల్లా కేంద్రానికి చెందిన మరో ఇద్దరు యువకులు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. దాడికి వచ్చిన ఇద్దరు యువకులకు తీవ్రగాయాల పాలై సీరియస్ కండిషన్‌లో హాస్పిటల్‌లో చేరారు.
- ఈ ఏడాది జనవరి 15న బీజేపీ నాయకుడు మెట్టుపల్లి జయ రామరావుపై బైపాస్ రోడ్డులోని మటన్ అండ్ షిప్ మార్కెట్‌లో దాడి జరిగింది. బైపాస్ రోడ్డులో ఉండే సదరు కాంగ్రెస్ నాయకుడికి చెందిన బ్యాచ్‌లోని వ్యక్తులే తనపై దాడి చేశారంటూ బాధితుడు చెప్పారు.
- మార్చి 9న రాత్రి తిలక్‌నగర్ శివాజీ గౌండ్‌లో ఎర్రగుంటపల్లి సంపత్‌పై దాడి జరిగింది. సంపత్‌ను తీవ్రంగా కొడుతూ.. పీకపై కాలేసి తొక్కుతూ.. అన్న చంపేయ్ అన్న వాడిని అంటూ దాడి చేస్తున్న వారు మాట్లాడిన వీడియో సైతం బయటికి వచ్చింది.
- మార్చి 27న నస్పూర్ సమీపంలోని ఎలైట్ బార్‌లో రెండు వర్గాల యువకులు పరస్పరం దాడి చేసుకున్నారు. మొదట ఓ బ్యాచ్ తాగిన మైకంలో తమ టేబుల్ దగ్గరకి వచ్చిన వ్యక్తితో వాగ్వాదానికి దిగి బీరుసీసాతో తల పగులగొట్టారు. అనంతరం ఆ వ్యక్తి స్నేహితులను పిలిపించడంతో పెద్ద ఎత్తున గొడవ జరిగింది.
- మార్చి 28న అర్ధరాత్రి మంచిర్యాల బస్టాండ్ సమీపంలోని డైమండ్ పాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో హమాలీవాడకు చెందిన ముగ్గురు యువకులు, ఓ టీస్టాల్ నిర్వాహకుడితో గొడవపడి ఆ నిర్వాహకుడిపై దాడి చేశారు. భారీగా రెండు వర్గాల యువకులు అక్కడ మోహరించారు. ఇదే సమయంలో ఘటనా స్థలానికి బైపాస్ రోడ్డు బ్యాచ్ సైతం వచ్చిందని, కానీ సమయానికి పోలీసులు రావడంతో యువకులంతా చెదిరిపోయారు. గొడవకు కారకులైన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- ఐదారు నెలల క్రితం మంచిర్యాల అరేబియన్ మండీ సమపంలోని ఓ బిల్డింగ్‌లో పేకాట ఆడుతూ కొందరు గొడవ పడ్డారు. బూతులు తిట్టుకోవడంతో ఓ వ్యక్తి సైట్ బ్యాచ్‌ను పిలిపించి మరో వ్యక్తిపై తీవ్రంగా దాడి చేశారు.
- ఇక ఎమ్మెల్యే ప్రకటన చేసిన నెలలోనే సెప్టెంబర్ 17న ఐబీ చౌరస్తాలోని మా విందు హోటల్‌లో మొన్నటి ఘటనలో దాడికి గురైన దగ్గుల మధుపై ఇదే సైట్ బ్యాచ్ దాడి చేసింది. ఈ ఘటనలో గాయపడిన అతన్ని తీవ్రంగా బెదిరించడంతో కేసు పెట్టడానికి వెనకాడారు. అదే మధుపై మరోసారి గురువారం రాత్రి అదే సైట్ బ్యాచ్ దాడి చేసింది. తప్పించుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

సెప్టెంబర్ 17న బీఆర్ఎస్‌వీ లీడర్‌పై మా విందు హోటల్‌లో ఓ బ్యాచ్ దాడి చేస్తున్న దృశ్యం

తిలక్‌నగర్ శివాజీ గ్రౌండ్‌లో ఎర్రగుంటపల్లి సంపత్ పీకపై కాలుపెట్టి తొక్కుతున్న సైట్ బ్యాచ్

దగ్గుల మధు చికిత్స పొందుతున్న హాస్పిటల్ ముందు నుంచి గురువారం రాత్రి 12.30 గంటలకు సైరన్ వేసుకొని చక్కర్లు కొడుతున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నాయకుడు సుర్మిళ్ల వేణు వాహనం

దాడిలో గాయపడిన దగ్గుల మధు

గ్యాంగ్‌వార్స్

- కొత్త సీపీ వచ్చాక పరిస్థితి మారుతుందని హామీ ఇచ్చిన పోలీసులు
- తాజాగా బీఆర్ఎస్‌వీ నాయకుడిపై దాడితో పోయిన నమ్మకం
- గతంలోలాగే ఈ దాడి జరిగింది కూడా బైపాస్ రోడ్డులోనే..
- అప్పటిలాగే. ఇప్పుడూ దెబ్బలు తగిలిన వ్యక్తిపైనే ఉల్టా కేసు
- ఖాకీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో మళ్లీ మొదలైన దాడులు ప్రజల్లో భయాందోళనలు

మంచిర్యాల, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో గ్యాంగ్ వార్స్ అలజడి మళ్లీ మొదలైంది. గతంలో వరుస దాడులు కలకలం రేపగా, ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతం కావడం ఇక్కడి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నది. మంచి మంచిర్యాలగా పేరున్న నగరంలో ఎప్పుడు ఎవరిపై దాడి జరుగుతుందోనని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల లీడర్లు, సామాజిక కార్యకర్తలు వణికిపోవడం పరిపాటిగా మారుతున్నది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గతేడాది సెప్టెబర్ 23న ప్రెస్‌మీట్ పెట్టి మరీ మంచిర్యాలలో రౌడీయిజం, గూండాయిజం ఉండనివ్వమంటూ స్పష్టం చేశారు. కానీ, ఆయన ప్రకటన చేసిన రోజే అర్ధరాత్రి మంచిర్యాల బైపాస్ రోడ్డులో రెండు వర్గాల యువకులు కత్తులు, రాడ్‌లతో పరస్పర దాడులు చేసుకోవడం కలకలం సృష్టించింది. ఎమ్మెల్యే చెప్పిన వినకుండా ఆయన అనుచరుడికి చెందిన బ్యాచ్ నిత్యం దాడులకు పాల్పడడం, ఎవరినో ఒకరిని కొట్టి వార్తల్లో నిలవడం.. కొట్టినోళ్లను పక్కనపెట్టి, దెబ్బలు తిన్నోళ్ల మీదే ఉల్టా కేసులు అవ్వడం.. నిత్య కృత్యంగా మారిపోయింది. ఇలా మంచిర్యాలలో వరుస దాడుల నేపథ్యంలో రామగుండ సీపీ అంబర్ కిషోర్ ఝా ఈ ఏడాది మార్చిలో బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు తీసుకోడానికి ముందు రోజే మంచిర్యాలలో ఎర్రగుంటపల్లి సంపత్ అనే వ్యక్తిపై సైట్ బ్యాచ్ దాడి చేసింది. ఈ నేపథ్యంలో మంచిర్యాలలో ఇకపై దాడులు జరగవని, పరిస్థితి మారుతుందంటూ పోలీసులు హామీ ఇచ్చారు. అలా హామీ ఇచ్చి రెండు.. మూడు నెలలైనా గడవకముందే బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు దగ్గుల మధుపై దాడి జరగడం.. అది కూడా బైపాస్ రోడ్డులోని సైట్ ఏరియాలోనే చోటుచేసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రామగుండం కొత్త సీపీగా అంబర్ కిషోర్ ఝా వచ్చాక.. ఏప్రిల్ 1న తిలక్‌నగర్ నాకా బంధి ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ, ఏసీపీ మీడియాతో ఆఫ్ ది రికార్డులో మాట్లాడుతూ.. ఇక నుంచి మార్పు ఉంటుంది. దాడులు జరగవు. మీరే చూస్తారంటూ చెప్పారు. కానీ ఇలా చెప్పిన ఒకటీ, రెండు రోజులకే మంచిర్యాల శ్రీనివాస గార్డెన్ సమీపంలో ఓ బ్యాచ్ వార్ జరిగింది. ఆ ఘటన అనంతరం ఆరుగురు యువకులను అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు పోలీసులు చెబుతున్నారు. అప్పటి నుంచి మంచిర్యాలలో గొడవలు, దాడులు తగ్గుముఖం పట్టాయి. ఇక అంతా ప్రశాంతం అనుకుంటున్న సమయంలో మంచిర్యాలలో కొందరు యువకులు బుధవారం రాత్రి ఓ స్కూల్ వ్యాన్ డ్రైవర్‌పై నలుగురు యువకులు దాడి చేశారు. తాగిన మైకంలో జరిగిందంటూ కేసు నమోదు చేశారు. అది జరిగిన మరుసటి రోజే బీఆర్ఎస్‌వీ నాయకుడు దగ్గుల మధుపై దాడి జరిగింది. సైట్ ప్రాంతంలోనే ఈ దాడి జరగడం, నస్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు ఇందులో కీలకంగా వ్యవహరించారంటూ బాధితుడు చెప్పడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. పోలీసులు హామీ ఇచ్చాక కూడా ఇలా దాడులు జరుగుతుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పోలీసులు తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు..

దాడి చేసి రెచ్చగొట్టి..

గురువారం రాత్రి సైట్ బ్యాచ్ చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన దగ్గుల మధు ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మధును తీసుకెళ్లి, దాడి చేయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సుర్మిళ్ల వేణు తన నల్లరంగు స్కార్పియో వాహనంలో సైరన్ వేసుకొని హాస్పిటల్ ముందు నుంచి బైపాస్ రోడ్డు వరకు చక్కర్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలను బీఆర్ఎస్ నాయకులు విడుదల చేశారు. దాడి చేయడంతో పాటు చికిత్స పొందుతున్న దగ్గర బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని తెలిసి కూడా సైరన్ వేసుకొని కారులో చక్కర్లు కొట్టడం.. ఎవరిని రెచ్చగొట్టేందుకు చేశారని.. ఇంత జరుగుతుంటే పోలీసులు పట్టించుకోలేదని అంటున్నారు. ఇలా వెహికిల్‌లో సైరన్ వేసుకొని చక్కర్లు కొడుతున్న సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లు సైతం హాస్పిటల్ దగ్గరే గస్తీ కాస్తున్నారని బీఆర్ఎస్ లీడర్లు చెబుతున్నారు. దాడి చేసిన వ్యక్తులు ఇలా వాహనం వేసుకొని తిరుగుతుంటే పోలీసులు చోద్యం చూడడం, దాడికి కారకులైన వారిని అదుపులోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా దాడిలో తీవ్రంగా గాయపడిన మధుపైనే ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతంలోనూ పలు గొడవల్లో పోలీసులు దాడిలో గాయపడిన వారిపైనే కేసులు నమోదు చేయడంతో విచారణలో అలసత్వం ప్రదర్శించారంటూ బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

అవిశ్రాంత పోరాటం చేసిన వ్యక్తి జయశంకర్

- మాజీ మంత్రి జోగు రామన్న

విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూన్ 21 : తెలంగాణ ఆత్మగౌరవం కోసం నిరంతరం అవిశ్రాంతిగా పోరాటం చేసిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం జయశంకర్14వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని స్థానిక తెలంగాణ తల్లి చౌక్‌లో గల జయశంకర్ సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. పూలమాలలు వేసి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ.. సార్ చేసిన నీటి జలాల ఉద్యమం ఫలితమే నేడు ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీటిని అందిపుచ్చుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో యూనిస్ అక్బనీ, మెట్టు ప్రహ్లాద్, పట్టణ అధ్యక్షులు అజయ్, అశోక్ స్వామి, ఇజ్జగిరి అశోక్, మేస్త్రం పరమేశ్వర్, పురుషోత్తం, దమ్మాపాల్, అన్నెలా వసంత్, అంజాత్, నవతే శ్రీనివాస్, జంగిలి ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూలును ఉట్నూర్‌లో నిర్మించవద్దు

ఖానాపూర్‌లోనే స్కూలును నిర్మించాలని పెంబిలో ధర్నా

ధర్నా చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

పెంబి, జూన్ 21 : ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్‌లో కాకుండా ఎమ్మెల్యే చొరవతో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్మించడంపై పెంబి మండలంలోని అఖిలపక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్లకార్డులు పట్టుకుని రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఉట్నూర్‌లో నిర్మిస్తే ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఖానాపూర్ పట్టణంలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద అనుకూలమైన స్థలం ఉన్నప్పటికీ స్థలం సాకుతో స్కూలును తరలించడంపై మండిపడ్డారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ఎస్ఐ హన్మండ్లు ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్లా నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు భూక్య గోవింద్, మహేందర్, గాండ్ల శంకర్, సరోజ, రాజేందర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కడెం, జూన్ 21 : ఖానాపూర్‌కు మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఖానాపూర్‌లో కాకుండా ఉట్నూర్ మండలానికి తరలించే ప్రయత్నాలు సరికాదని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలతోపాటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారి అయిన ఖానాపూర్‌లోని కుమ్రం భీం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసి, ఈ ప్రాంతవాసుల చిరకాల కోరికను నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించిన అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రభాకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, నాయకులు శ్రీరాం, నల్లగొండ, తోట రాజేశ్వర్, తిరుమల్, కృష్ణ, బుర్ర సాయి పాల్గొన్నారు.

ఒంటికీ, రెంటికీ ఒక్కటే మరుగుదొడ్డి

ఆదిలాబాద్ జిల్లా మావల జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 130 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 70 మంది బాలురు, 60 మంది బాలికలు ఉన్నారు. వీరితోపాటు నలుగురు ఉపాధ్యాయులు, మరో నలుగురు టీచర్లు బోధిస్తున్నారు. ఒక అటెండర్, ఇద్దరు వంట మనుషులు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఒక్కటే మరుగుదొడ్డి ఉండడంతో ఇంటర్‌వెట్ సమయంలో టాయిలెట్స్ ఎదురుగా బారులుదీరుతున్నారు. విద్యార్థులకు సరిపడా బాత్ రూంలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- కేజీబీవీలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 21 : పేద విద్యార్థులు చదువులో రాణిస్తే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నిమ్మల ప్రీతంరెడ్డి, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, ఇచ్చోడ మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు రాథోడ్ సురేందర్, రాజశేఖర్, సంతోష్‌సింగ్, గులాబ్‌సింగ్, ప్రతాప్‌సింగ్, పాఠశాల ఎస్‌వో రజిత పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

ఉట్నూర్, జూన్ 21 : ఆదిలాబాద్ జిల్లాలోని బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలో గిరిజన విద్యార్థుల ప్రవేశానికి నిర్వహించిన కార్యక్రమం శనివారం స్థానిక ఐటీడీఏలోని గిరిజన దర్బార్ భవనంలో పీవో ఖుష్బూ గుప్తా ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగింది. ఇందు కోసం లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. 8వ తరగతిలో 12 సీట్లకు 88, 5వ తరగతిలో 12 సీట్లకు 270 దరఖాస్తులు, 3వ తరగతిలో 24 సీట్లకు 244 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తరగతి వారిగా దరఖాస్తుదారుల పేర్లను లాటరీ పద్ధతిలో ఒక్కొక్కటిగా తీశారు. ఈ కార్యక్రమంలో డీడీ అంబాజీ, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, ఏటీడీవో క్రాంతి, జిల్లా గిరిజన క్రీడాధికారి పార్థసారథి, జీసీడీవో చాయ, ఎంఎల్ఐటీ దేవ్‌రావు, ఏవో వేణుమాధవ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జిరాక్స్ దుకాణం యజమాని రిమాండ్

ఇచ్చోడ, జూన్ 21 : ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్చిన జిరాక్స్ షాప్ ఓనర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ ఏఎస్సీ కాజల్‌సింగ్ శనివారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న మండలంలోని దాబా(బీ) గ్రామానికి చెందిన మన్నె కృష్ణ తన తండ్రి క్రాప్ లోను గురించి ఇచ్చోడ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్దకు వచ్చాడు. లోనుకు సంబంధించిన పత్రాల జిరాక్స్ కోసం మైక్రో జిరాక్స్ సెంటర్ వద్దకు వెళ్లగా అక్కడున్న షాప్ ఓనరు అబ్దుల్ తన్వీర్ ఆధార్ కార్డులో పుట్టినరోజు తేదీని ఎడిట్ చేయడం చూసి షాప్ ఓనరు చీట్ చేస్తున్నాడని తెలుసుకున్నాడు. తన ఆధార్ కార్డు ఇచ్చి అందులో పుట్టిన తేదీని మార్చు అని అనగా 01/01/2000 ను 01/01/2004గా మార్చాడు. వెంటనే తను ఇలా నకిలీ పత్రాలు సృష్టించి అమాయకులను, ప్రభుత్వ లబ్ధిదారులను మోసం చేస్తున్నాడని గ్రహించి ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇచ్చాడు. ఈనెల 20న అబ్దుల్ తన్వీర్ షాప్‌లో ఉండగా ఎస్సై వి.పురుషోత్తం, సిబ్బంది వెళ్లి నిందితుడిని పట్టుకున్నారు. మూడు నెలల నుంచి ఇలా తప్పుడు నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారని, తన షాప్‌లో ఉన్న కంప్యూటర్, ప్రింటర్, లామినేషన్ మిషన్ ఉపయోగించుకుని ఇట్టి నకిలీ పత్రాలను తయారు చేస్తున్నానని తెలిపాడు. ఈ యంత్రాలను సీజ్ చేసి, షాప్ ఓనర్ అయిన అబ్దుల్ తన్వీర్‌ను బోథ్ కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు.